

# కమ్యూనిటీ హాల్,కబరిస్తాన్ ప్రహరీ గోడ కోసం నిధులు మంజూరు

- **సమస్యలకు పరిష్కారం చూపెడుతున్న ప్రణవ్.**
- **ప్రహరీ,కమ్యూనిటీ హాల్ కోసం అనేక పార్టీలకి చెందిన నాయకులకు వినతులు.**
- **నిధులు మంజూరు చేపించిన ప్రణవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మైనార్టీ సోదరులు.**

**శెనార్తి మీడియా హుజురాబాద్**

కాంగ్రెస్ పరిపాలనలో ఏళ్లుగా పరిష్కారం కానీ సమస్యలకు పరిష్కారం చూపెడుతుందని ఇది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని మైనార్టీ నాయకులు తెలిపారు.మంగళవారం రోజున హుజురాబాద్ మండల పరిధిలోని పెద్దపాపయ్యపల్లి,కందుగుల గ్రామాల్లో కమ్యూనిటీ హాల్,కబరిస్తాన్ ప్రహరీ గోడ కోసం ఎస్డిఎఫ్ నిధుల నుండి పదిహేను లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని,అనేక సంవత్సరాలుగా ఈ విషయమై అన్ని పార్టీల నాయకులను అడిగగా చేస్తాం చూస్తాం అని మాట చెప్పడమే తప్ప చేసింది లేదని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రణవ్ నాయకత్వంలో ఈ విషయం దృష్టికి తీసుకురాగా హామీ ఇవ్వగా ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేపించారని,దీని పట్ల ప్రణవ్ కు,మంత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి,ప్రణవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు.ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా మైనార్టీ సోదరులు,నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- **హోటళ్లలోకి దూసుకెళ్లి మహిళకు స్వల్ప గాయాలు**

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండల పరిధిలోని తాడికల్ గ్రామంలో సోమవారం వేకువజామున రోడ్డు ప్రమాదం జరిగింది. కర్నూల్ నుండి ఆయిల్ ప్యాకెట్లతో వచ్చిన లారీని దుకాణంలో దిగజార్చేందుకు రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. ఈ సమయంలో ఖమ్మం నుండి మహారాష్ట్రకు వెళ్తున్న మరో లారీ వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని ఢీకొట్టి పక్కనే ఉన్న హోటల్లోకి దూసుకెళ్లింది. అదే సమయంలో రోడ్డు దాటుతున్న అరుణ అనే మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. అదృష్టవశాత్తు హోటల్ తెరవకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటన స్థలానికి కేశవపట్నం పోలీసులు చేరుకుని పరిశీలించారు.



# రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ రజక సంఘం గ్రామ శాఖ అధ్యక్షునిగా నాంపెల్లి శంకరయ్య,ప్రధాన కార్యదర్శిగా దండు సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా నేరెళ్ల సంతోష్ తో పాటు నూతన పాలకవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .ఈ సమావేశంలో కొమురయ్య మాట్లాడాతు మొలంగూర్ గ్రామంలోని శ్రీ మడేలేశ్వర రజక సహాయ సహకార సంఘం సమావేశాన్ని గ్రామంలో నిర్వహించి,నూతన అధ్యక్షునిగా నాంపల్లి శంకరయ్య,ప్రధాన కార్యదర్శిగా దండు సమ్మయ్య, ఉపాధ్యక్షులుగా నేరెళ్ల సంతోష్,గౌరవ అధ్యక్షులుగా గ్రామ మాజీ సర్పంచ్ దండు సాయిలు,దండు సాయిలు అటెండర్,కోశాధికారిగా తాడిచర్ల బిక్షపతి ,ముఖ్య సలహాదారుగా దండు కొమురయ్య, కార్యదర్శిగా నాంపల్లి వినోద్,కార్యవర్గ సభ్యులుగా దండు శ్రీనివాస్ ,రాజేష్,నాంపల్లి రాజేందర్,నేరెళ్ల సదయ్య, నాంపల్లి వీరమల్లు,అంజి, తాడిచెర్ల లక్ష్మీపతి, తడిగొప్పుల రాధ,కొండపర్తి స్వామి,నాంపల్లి చిన్న వెంకటమ్మ,దండు కొమురయ్యతో పాటు మరికొంతమందిని కార్యవర్గ సభ్యులుగా సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా నియామకం చేస్తునట్లు అయినా తెలిపారు .



# చోరీకి గురైన గొర్రెలను పట్టుకున్న పోలీసులు

**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

జనగాం పోలీస్ స్టేషన్ పరిధిలోని చోరీకి గురైన గొర్రెలను సోమవారం అర్ధరాత్రి శంకరపట్నం మండలం మొలంగూరు గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్న సంఘటన జరిగింది.వివరాల్లోకి వెళితే, జనగాం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో 10 గొర్రెలను శంకరపట్నం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దొంగలించి సోమవారం రాత్రి పట్టుకొని వస్తుండగా జనగాం నుండి వాహనాన్ని వెంబడించి శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులో గొర్రెలను పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను తీసుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు. కాగా ఓటర్లు 10 గొర్రెలను జనగాం పోలీసులు మంగళవారం తెల్లవారుజామున తరలించిన సంఘటన మండలంలో చర్చనీయమైంది.

# పిల్లల ఆరోగ్యం పరిరక్షణపై ప్రత్యేక చర్యలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్. యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మండల విద్యాధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్లు ప్రధానమంత్రి పోషణ్ కార్యక్రమం కింద మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై సమీక్ష చేశారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 747 పాఠశాలల్లో చదువుతున్న 34,818 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం క్రింద మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు రోజు విడిచి కోడిగుడ్డు ఇవ్వడం జరుగుతోందని, 1 నుండి 8వ తరగతి వరకు చెల్లింపులు జూలై 2025 వరకు పూర్తయ్యాయని, మిగిలిన బిల్లులు త్వరలో చెల్లించబడతాయని చెప్పారు. వారి ఆరోగ్యం కోసం 100 శాతం వి ద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం కింద లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజల సహకారంతో స్కూల్ న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించడానికి, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించి ఆహారాన్ని వేడి వేడిగా అందించాలని ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. విద్యాధికారి, మండల విద్యాధికారులు పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు. వంటశాలలు, ప్రహరీ గోడల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని, విద్యార్థుల ఎత్తు, బరువు కొలతలను తీసుకుని స్టూడెంట్ హెల్త్ కార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వంట మనుషులు నాణ్యత ప్రమాణాలు పాటించి, తాజా కూరగాయలు వినియోగించి వంట చేయాలని, ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ఆహారం నాణ్యత, పోషక విలువలను పర్యవేక్షించాలన్నారు. భవిత సెంటర్లు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, బెల్లంపల్లి అకాడమీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, సమగ్ర శిక్షాభియాన్ నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా, కె.జి.బి.వి., ఆశ్రమ పాఠశాలలకు ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థులు తెలుగు భాష నేర్చుకోవడానికి చర్యలు తీసుకోవాలని, కొత్త ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



# ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల శ్రమ దోపిడి

- **- దసరా సెలవులు అమలు చేయాలని డిమాండ్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల శ్రమను దోపిడీ చేస్తున్న యాజమాన్యాల తీరును నిరసిస్తూ తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ( టీవీ యు వి ) ఆధ్వర్యంలో స్థానిక కేంద్రంలో పాత్రికేయ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు ఈ నెల 21వ తేదీ నుండి దసరా సెలవులు ప్రకటించినప్పటికీ, మంచిర్యాల జిల్లాలో ఆ ఉత్తర్వులు అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సెలవులు ప్రకటించినప్పటికీ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను విధులకు హాజరు కావాలని, లేకపోతే జీతాలను నిలిపివేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం మానసిక హింసగా భావిస్తున్నారని తెలిపారు.

జిల్లా కేంద్రంలో ఉన్న విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సమస్యలపై స్పందించకపోవడం, కొన్ని కార్పొరేట్ యాజమాన్యాలు ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసి ఇంటింటికి పంపించడం సిగ్గుచేతని విమర్శించారు.

ప్రతిపక్షం డిమాండ్ చేసింది, జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల విద్యాశాఖ నిబంధనలను పాటించేలా కఠిన చర్యలు తీసుకోవాలి. విధులకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు కూడా సెలవులు ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాలాజీ, విష్ణు, రమేష్, సాయి చరణ్ పాల్గొన్నారు.

# హామీల అమలు... చెక్కుల పంపిణీ

- **రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం మందమర్రి పట్టణంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించామని, అర్హత గలవారందరికీ ఇళ్లు కేటాయించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. గత 10 సంవత్సరాలలో అందని రేషన్ కార్డులను అర్హులకు అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేశామని తెలిపారు. ఇందుకోసం 9 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

మందమర్రిలో రహదారులు, మురుగు కాలువల అభివృద్ధికి 50 కోట్లతో పనులు జరుగుతున్నాయని, అమృత్ పథకం ద్వారా శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించి, 10 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఫలితంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని చెప్పారు.

ప్రజా సంక్షేమంలో భాగంగా 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 10 లక్షల పరిమితితో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం మండలంలోని 82 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పునరుద్ధరించబడిన మెప్మా కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసిల్దార్ సతీష్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యాలయం 567 స్వయం సహాయక సంఘాల 5,948 మహిళలకు సమావేశాలు, బ్యాంకు కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా బలపడేందుకు ప్రోత్సహిస్తున్నామని వివరించారు. మహిళ సంక్షేమం కోసం ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అనంతరం క్యాతనపల్లి పరిధిలోని సంఘాలకు 2 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# తహసీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జైపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వనజా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూలతో తమ బతుకమ్మలను అందంగా అలంకరించారు. రంగు రంగుల పూలతో నిండిన ప్రాంగణంలో సంప్రదాయ బతుకమ్మ పాటలు, నృత్యాలతో ఉత్సవ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా తహసీల్దార్ వనజా రెడ్డి మాట్లాడుతూ... "బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక. ప్రకృతిని ఆరాధించే అద్భుతమైన సంప్రదాయం ఈ బతుకమ్మలో ప్రతిబింబిస్తుంది. పువ్వులను పూజించడం ద్వారా మనం ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. బతుకమ్మ పండుగ సమాజంలో ఐక్యత, ఆనందాన్ని పెంపొందించే వేడుక" అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి రావు, ఐకేపీ మహిళా సంఘ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. మహిళలు వలయంగా చేరి బతుకమ్మ చుట్టూ నృత్యాలు చేస్తూ సంప్రదాయ గీతాలను ఆలపించారు.

అనంతరం మహిళలకు బహుమతులు పంపిణీ చేయగా, పిల్లలకు మిఠాయిలు పంచారు. స్థానిక ప్రజలు ఈ వేడుకలో భాగస్వామ్యమై ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.



# తెలంగాణ ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ

- **సరస్వతి హైస్కూల్ హెచ్ఎం ఉప్పుల శ్రీనివాస్**

**రామడుగు :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఔన్నత్యానికి బతుకమ్మ పండగ ప్రతీక అని సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ హెచ్ఎం ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. రామడుగు మండలం వెలిచాల సరస్వతి హైస్కూల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ ప్రకృతితో ముడిపడి ఉన్న ప్రత్యేకమైన పండగ అని, ఇది తెలంగాణ మహిళల జీవిత వేడుక అని కొనియాడారు. గౌరీదేవి ఆశీస్సులతో అందరికీ మంచి ఆరోగ్యం సమకూరాలని ఆకాంక్షించారు. పేరెంట్స్ కోరిక మేరకు తమ స్కూల్లో ఏటా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఫోక్ సింగర్ వొల్లాల వాణి, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, మాజీ సర్పంచులు వీర్ల రవీందర్రావు, కాడె శంకర్, కొండగట్టు ఆలయ మాజీ డైరెక్టర్ బండపెల్లి యాదగిరి, శ్రీ ప్రగతి హైస్కూల్ చైర్మన్ అన్నదానం రాధాకృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ మెంబర్ శుక్రొద్దీన్, ఎల్ఐసీ డీవో వీర్ల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



# సూపర్ స్పెషాలిటీ పనులు వేగవంతం

- **ఐ.బి. ప్రాంతంలో కలెక్టర్ పరిశీలన**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐ.బి. ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 300 కోట్ల రూపాయల వ్యయంతో 650 పడకలతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టిందని వివరించారు.

అనంతరం రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని ఆర్.డి.ఓ. శ్రీనివాస్ రావు తో కలిసి ఆకస్మికంగా సందర్శించి జాతీయ రహదారి 63 విస్తరణ పనుల పురోగతిని పరిశీలించారు. భూములు కోల్పోయిన అర్హులైన వారికి నష్టపరిహారం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కార్యాలయానికి వచ్చిన అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, దరఖాస్తులను నిబంధనలకు లోబడి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్రాగునీరు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



